క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

గజపతినగరం: మండల కేంద్రంలోని పురిటి పెంట న్యూకాలనీలో హర్షవర్ధన్ హైస్కూల్ ఆవరణలో స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయనగరం ఎస్.వి.కె.బ్లడ్ బ్యాంకు సిబ్బంది శిబిరంలో 35 మంది యువకుల నుంచి రక్తం సేకరించారు. హర్షవర్ధన్ హైస్కూల్ కరస్పాడెంట్ వి.వి.ప్రదీప్ కుమార్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రాండ్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సాయిసిద్ధార్థ కళాశాలల కరస్పాండెంట్ పెద్దినాయుడు

గజపతినగరం: జిల్లాలోని పదోతరగతి విద్యార్థులకు మండలంలోని శారదా నగర్‌లోని సాయిసిద్ధార్థ జూనియర్, డిగ్రీ కాలేజ్‌లో ఆదివారం నిర్వహించిన గ్రాండ్ టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించింది. జిల్లాలోని 9 మండలాల నుంచి 1,458 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని కళాశాల కరస్పాండెంట్ శీరంరెడ్డి పెద్దినాయుడు, శారదనాయుడు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది విద్యార్థులకు కళాశాల యాజమాన్య ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రావాలమ్మ తల్లి పండగ



పూజారి రావాలమ్మను ఊరేగిస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామదేవత రావాలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారి ఘటాలను గ్రామంలో మేళతాళాల మధ్య ఊరేగించారు. పూజారి రావాలమ్మకు 101 బిందెలతో జలాభిషేకం చేసి గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీ సమావేశం

శృంగవరపుకోట: స్థానిక ఆర్.కె.ఫంక్షన్ హాల్‌లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి టీడీపీ నాయకుల సమావేశం ఆపార్టీ నాయకుడు గొంపకృష్ణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఆపార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ పట్టభద్రులంతా తనకు మద్దతు తెలపాలని, తన విజయానికి పార్టీ శ్రేణులంతా కష్టపడి పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షలపై భయం పోగొట్టేందుకే...



శృంగవరపుకోట: పరీక్షకు హాజరైన విద్యార్థులు

శృంగవరపుకోట/జామి: పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై భయం పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస్ పరీక్ష నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చినబాబు తెలిపారు. ఎస్.కోట చైతన్య డిగ్రీ కళాశాల కేంద్రంగా ఆదివారం నిర్వహించిన పరీక్షకు 400 మంది విద్యార్థులు, జామి ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు కల్యాణి, రమేష్, విజయ్‌నాయుడు, రఘు జగదీష్, రూప, ప్రియాంక, లక్ష్మి, జ్యోతి, కృష్ణారావు, తేజ, జగదీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫేకర్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఫేకర్‌లో తక్షణమే గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని లేబర్ యూని యన్ నాయకుడు రాజాన రమణ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కంపెనీలో రెండేళ్లకు ఒకసారి గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, మూడున్నరేళ్లుగా ఎన్నికలను జరిపించకపోవడం వల్ల కార్మికుల తరపున మాట్లాడే నాయకత్వం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించాలని ఫేకర్ లేబర్ యూనియన్ గతేడాది మార్చిలో అర్జీ అందించడంతో, అదే ఏడాది సెప్టెంబర్-27న ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చారని, నేటి వరకు పోలింగ్ తేదీ ప్రకటించకపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

వైభవంగా కనకమహాలక్ష్మి జాతర

- తొలిరోజు జాతరలో అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, వేలాది మంది భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యులు

చీపురుపల్లి: పట్టణంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. పట్టణంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని వివిధ రకాల పూలతో భక్తులను ఆకట్టుకునే విధంగా అలంకరించారు.

జంగిడీలు, ప్రభ సంబరాలు

అమ్మవారి జాతరలో భాగంగా తొలిరోజు ఆదివారం జంగిడీలు, ప్రభ సంబరాలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం జాతర తొలిరోజు జంగిడీల ప్రదర్శన ఉంటుంది. అమ్మవారి పసుపు, కుంకుమలతో జంగిడీలను ఊరేగింపు , ప్రభ సంబరాలు నిర్వహిస్తారు. ఈకార్యక్రమాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రారంభించారు. ప్రభలతో భక్తులు అమ్మవారి దేవస్థానానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంది.

ప్రభల ఊరేగింపు...

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను పురస్కరించుకుని మండలంలోని రామలింగాపురం, పుర్రేయవలస గ్రామాలకు చెందిన భక్తులు ప్రభ సంబరాలు నిర్వహించారు. 20 ప్రభలతో ఊరేగింపుగా ఆలయాని తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి అనంతం ఆధ్వర్యంలో ఏటా ప్రభ సంబరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా గ్రామాల నాయకులు , పెద్దలు కంది పాపినాయుడు, కంది అప్పారావు, ఇప్పిలి రాము, అప్పలనాయుడు, శ్రీరాములు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దేవస్థానంలో మంత్రి బొత్సకు అమ్మవారి ప్రతిమను అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, దేవస్థానం ఈఓ



పూల అలంకరణలో కనమహాలక్ష్మి అమ్మవారి ఆలయం



దర్శనానికి వచ్చిన భక్తులతో కిక్కిరిసిన క్యూలు



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



అమ్మవారి ఆలయానికి చేరుకుంటున్న ప్రభలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తజన సందడి



రావి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు



జంగిడీల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



ఆలయానికి వెళ్లే మార్గంలో విద్యుత్ అలంకరణ

గృహసారథులే విజయానికి వారధులు

- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



టి.భూర్జవలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వివరించి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి వారధులుగా పని చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు అధ్యక్షతన చినకాద, కన్నాం, ఎం.లింగాలవలస, దానుపేట, గడసాం, టి. భూర్జవలస, గుచ్చిమి, దత్తి, సరయ్యవలస, పోరలి గ్రామాల్లో గృహ సారథు లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 98 శాతం ఈ మూడున్నరేళ్లలోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని చెప్పారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామసచివాలయ, రైతుభరోసా కేంద్రాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయని, 'మానమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ద్వారా వీటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. గృహసారథులు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి గతంలో టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను వివరించాలని చెప్పారు. అలాగే ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని, కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయా గ్రామాల్లో పట్టభద్రులను ఎమ్మెల్యే కలిసి కోరారు. టి.భూర్జవలసలో ఎంపీటీసీలు మంత్రి అప్పలనాయుడు, ఉషారాణి, సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను ఎమ్మెల్యేను సన్మానించారు.
ఏఎంసీ చైర్మన్ ముత్యాలనాయుడు, ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, పార్టీ జిల్లా బీసీ సెల్ విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అప్పలనాయుడు, రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు ..

దత్తిరాజేరు మండలంలోని దాసరిపేట, పెదమానాపురం, పెదకాద, ఇంగిలాపల్లి, గొభ్యాం, కోమటిపల్లి, వంగర, వి.కృష్ణాపురం దత్తిరాజేరు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సోమవారం సమావేశం కానున్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు, సచివాలయ గృహసారథుల మండల కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.



గుచ్చిమిలో గృహసారథులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే

ఆలయ ఆర్చ్ ప్రారంభం



ఆర్చ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయం ఆర్చ్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో అమ్మవారి దేవస్థానంకు వెళ్లే మార్గంలో రూ.40 లక్షల తన సొంత నిధులతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఈ ఆర్చ్ నిర్మాణం చేపట్టారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, దన్నాన జనార్దన్, ఇప్పిలి గోవింద, సూరు కామేష్, రేవల్ల సత్తిబాబు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర



మూలవిరాట్ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని కుమ్మరిబంజరి సమీపంలోని గరుడాద్రి కొండపై నిర్మించిన లక్ష్మీ దేవి,గోదాదేవి అమ్మవార్ల సమేత కల్యాణ వేంక టేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాల శోభా యాత్రను తొలిరోజు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి బోని వెంకటప్పారావు ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవార్లు, స్వామివార్ల విగ్రహాలకు పూజలు చేసి ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అనంతరం ఆలయ సమీపంలో నిర్మించిన పర్ణశాలలో విగ్రహాలను భద్రపరిచారు. సోమవారం నుంచి బుధవారం వరకు విశేష పూజలు, హోమాలు నిర్వహించి, విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

రూ.1.27 కోట్లతో ఇంటింట కుళాయిలు



రామస్వామిపేటలో చేపడుతున్న పైపులైన్ ఏర్పాటు పనులు



బోజంకి వానిపాలెంలో పైపులైన్ వేస్తున్న సిబ్బంది

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.1.27 కోట్లతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.దేవి ఆదివారం తెలిపారు. పి.కె.ఆర్.పురం గ్రామానికి రూ.8.4 లక్షలు, చినగుడిపాల పంచాయతీ బోజంకి వానిపాలెంకు రూ.10.70 లక్షలు, నల్లబిల్లి పంచాయతీ పరిధి చలుమూరివాని పాలెంకు రూ.9.6 లక్షలు, వారాది కొంపలు గ్రామానికి రూ. 9.6 లక్షలు, వావిలపాడు పంచాయతీ కడకొండకు రూ. 15.37లక్షలు, వేపాడ పంచాయతీ చిరతపాలెంకు రూ.5.4 లక్షలు, కొండగంగుబూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురం గ్రామానికి రూ.17.25లక్షలు, రామస్వామిపేటకు రూ.15.33 లక్షలు, వీలుపర్తి పంచాయతీ రాయుడుపేటకు రూ. 10.7లక్షలు, బానాదికి రూ.18.92 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో బోర్ల తవ్వకాలు, పైపులైనులు, ట్యాప్‌లు ఏర్పాటు పనులు చేయిస్తున్నామని ఏఈ చెప్పారు. పనులు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. పనులు జోరుగా సాగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు యల్లారమ్మ సిరిమానోత్సవం

గంట్యాడ: మండల కేంద్రంలో యల్లారమ్మ తల్లి సిరిమానోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు శతకం పుట్ట వద్ద సిరిమానోత్సవం ప్రారంభమవుతుంది. శతకం పుట్ట నుంచి అమ్మవారి ఆలయం వరకు మూడు సార్లు సిరిమానును ఊరేగిస్తారు. అలాగే బుడతానపల్లి గ్రామంలోనూ ఎల్లారమ్మ తల్లి పండగ సోమవారం నిర్వహించనున్నారు.

గిరిజనులకు పట్టాలు ఇవ్వాలి

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కొండపైన పోడుభూమిని సాగు చేసుకుంటూ నివాసం ఉంటున్న గిరిజనులకు ప్రభుత్వం భూపట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. ఆదివారం ఆయన షికారుగంజి గ్రామంలో పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ఇళ్లు నిర్మించి ,తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మామిడి తోటల పరిశీలన



మామిడి తోటలను పరిశీలిస్తున్న సూర్యనారాయణ

బొండపల్లి: మండలంలోని చామలవలస, బి.రాజేరు, బొండపల్లి తదితర గ్రామాల్లోని మామిడి తోటలను ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ ఆదివారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని వనమిత్ర కేంద్రంలో రైతు సంఘం నాయకులు,రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి పంట తర్వాత ఎక్కువగా మామిడి పంటనే రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. పొగమంచు కారణంగా మామిడిలో పూతమాడి పోయిందని, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఫిబ్రవరి నెల ముగిసినా ఇంత వరకు పూత,పిందె పూర్తిస్థాయిలో రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు తీవ్రనష్టం కలుగుతున్న నేపథ్యంలో మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్దరాజు రాంబాబు, టి.పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంచు దుప్పటి



శ్రీరాంపురంలో ఉదయం 8 గంటల సమయంలో కురుస్తున్న మంచు

కొత్తవలస/ లక్కవరపుకోట: కొత్తవలస, ఎల్.కోట మండలాల్లో కొద్దిరోజులుగా పొగమంచు ఉదయం 9 గంటల వరకు కురుస్తునే ఉంది. ఆదివారం కురిసిన పొగమంచు కారణంగా వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలుపడాల్సి వచ్చింది. జీడి, మామిడి పూతకు ఈ మంచు తీవ్రనష్టం కలిగిస్తుందని రైతులు వాపోతున్నారు. పూతమాడిపోయి రాలిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా యల్లారమ్మ జాతర



యల్లారమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



జాతరలో అమ్మవార్ల వేషధారణతో నృత్య ప్రదర్శన

జామి: మూడు రోజుల పాటు నిర్వహించనున్న జామి యల్లారమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు ఆదివారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారిని వందలాది భక్తులు దర్శించుకుని చీరలు, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన రహదారి నుంచి ఆల యం వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతరలో పోలీస్‌శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



లక్కవరపుకోట: చందులూరులో పూడికలు తీస్తున్న కార్మికులు



గజపతినగరం: కాలువలో పూడికలను తొలగిస్తున్న కార్మికులు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో సర్పంచ్ రెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేశారు. గ్రామంలోని అన్ని వీధుల్లోని కాలువల్లో పూడిక, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి అప్పలనరసయ్య పర్యవేక్షించారు.

చందులూరులో...

లక్కవరపుకోట: మండలంలోని చందులూరులో ఎంపీటీసీ యడ్ల కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. కాలువల్లో పూడిక, చెత్తను తొలగించి గ్రామానికి దూరంగా తరలిస్తున్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: మండల కేంద్రంలోని కోవెలవీధిలో సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రాము నాయుడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను కార్మికులు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి రమణ పనులను పర్యవేక్షించారు.